పింఛన్ల పెంపుతో ఆనందం

- జనవరి 1 నుంచి రూ.3వేలు అమలు
- మండలంలో 7,812 మందికి లబ్ధి



కేఎల్‌వలసలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్

మెంటాడ: ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం అవ్వాతాతలకు, వితంతువులకు, దివ్యాంగులకు, చేనేత కార్మికులకు, కల్లుగీత కార్మికులకు, డప్పుకళాకారులకు ఇస్తున్న పింఛన్ మొత్తాన్ని జనవరి 1 నుంచి రూ.3 వేలకు పెంచుతూ ఇటీవల రాష్ట్ర కేబినెట్ నిర్ణయంతీసుకుంది. దీనిపై పింఛన్‌దారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో పింఛన్ డబ్బుల కోసం లబ్ధిదారులు పడిగాపులు కాయాల్సి వచ్చేది. ఎప్పుడు ఇస్తారో తెలిసేది కాదు. పింఛన్ మంజూరు కోసం జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వచ్చేది. పచ్చచొక్కాలు, టీడీపీ సానుభూతిపరులకే పింఛన్ మంజూరు చేసేవారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పింఛన్ మొత్తాన్ని పెంచడంతో పాటు ప్రతీ నెల ఒకటో తేదీన వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే తంచనుగా పింఛన్ డబ్బులు పంపిణీ చేస్తుండడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పింఛన్ అర్హత వయస్సు 65 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలకు తగ్గించడంతో పాటు పారదర్శకంగా ఎంపిక చేస్తుండడంతో లబ్ధిదారుల సంఖ్య మరింత పెరిగింది. మెంటాడ మండలంలో 7,812మంది పింఛన్‌దారులు ఉండగా వారికి ప్రతీ నెల రూ.2కోట్ల15లక్షలు నగదును పింఛన్ రూపంలో ప్రభుత్వం అందిస్తోంది.

నేరుగా ఇంటివద్దకే పింఛన్



ప్రతీ నెలా మా ఇంటికే వచ్చి పింఛన్ అందిస్తున్నారు. గతంలో పింఛన్ తీసుకోవాలంటే ఎంతో ఇబ్బంది పడేవాళ్లం. నాలాంటి ఎంతో మందికి వైఎస్సార్ పింఛన్ కానుకతో గౌరవంగా జీవిస్తున్నాం. లబ్ధిదారులమంతా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాం.

– పాంచ్రంకి చిన్నంనాయుడు, మెంటాడ

పెద్ద కొడుకులా ఆదుకున్నారు



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మమ్మల్ని పెద్దకొడుకులా ఆదుకుంటున్నారు. ప్రతీనెలా ప్రభుత్వం ఇస్తున్న పింఛన్‌తో నేను ఆర్థిక అవసరాలకు ఎవరిపైనా ఆధారపడకుండా జీవిస్తున్నాను.

– కొండల అప్పలనాయుడు, కొండలవీధి

చెప్పారు.. చేశారు



రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ ఏదైనా చెబితే తప్పకుండా చేస్తారనే నమ్మకం రాష్ట్ర ప్రజల్లో నాటుకుపోయింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలేకాకుండా ఇవ్వని హామీలను కూడా నెరవేర్చిన ఘనత జగనన్నదే. పేద ప్రజల కోసం ఎన్నోచేశారు. పింఛన్ మొత్తం చెప్పినట్లే పెంచుకుని వెళ్లారు. జనవరి నుంచి రూ.3 వేలు పింఛన్ అందిస్తున్నాం. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న జగన్‌కు రాష్ట్ర ప్రజలంతా అండగా నిలబడాలి.

– డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

పెన్షనర్లకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు
- ఘనంగా జాతీయ పెన్షనర్ల దినోత్సవం



బొబ్బిలి: సీనియర్ పెన్షనర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి, ఆర్డీఓ సాయిశ్రీ, తదితరులు

బొబ్బిలి: పెన్షనర్లకు ప్రభుత్వం అండగా ఉంటుందని, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు తీర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. జాతీయ పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక కళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మీ సమస్యల్ని తీర్చేందుకు ముందుకు వస్తున్నప్పుడు మీరు కూడా ప్రభుత్వానికి మద్దతుగా ఉండాలన్నారు. పెన్షనర్లు కోరినట్టుగా ఓల్డ్ ఏజ్ హోమ్ ఏర్పాటు ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. ఆర్డీఓ ఎ.సాయిశ్రీ మాట్లాడుతూ కుటుంబ సభ్యులు, వారసుల నుంచి నిర్లక్ష్యానికి గురైన వృద్ధులు, పెన్షనర్లకు వృద్ధుల సంరక్షణ చట్టం–2017 ప్రకారం రక్షణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా 75 సంవత్సరాల వయసు దాటిన 33 మంది విశ్రాంత ఉద్యోగులు, పెన్షనర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, జిల్లా ట్రెజరీ శాఖ ఏటీఓ ఆదినారాయణ, రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు రౌతు రామమూర్తి నాయుడు, బొబ్బిలి అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, నంబియార్ వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.



రాజాం: సీనియర్ పెన్షనర్లును సత్కరిస్తున్న అసోషియేషన్ సభ్యులు

పెన్షనర్లకు ఇంటి వద్దకే సేవలు

రాజాం: పట్టణంలోని సీతారామథియేటర్ సమీపంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. రాజాం పట్టణంతో పాటు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు చెందిన పెన్షనర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ స్టేట్ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శెట్టి గౌరీశంకరరావు మాట్లాడుతూ పెన్షనర్లకు కమ్యూనిటీ కార్యాలయంలో ఉచితంగా లైఫ్ సర్టిఫికెట్లు ఇస్తున్నట్లు వెల్లడించారు. ఎస్‌టీఓ కార్యాలయ అధికారి సుగుణ మాట్లాడుతూ ఫింగర్ ప్రింట్ పడని పెన్షనర్లకు ఫేషియల్ యాప్ ద్వారా సేవలు అందిస్తున్నామని, ఎస్‌టీఓ కార్యాలయానికి రాలేని వయోవృద్ధుల ఇంటికి వెళ్లి లైఫ్ సర్టిఫికెట్లు సేవలందిస్తున్నట్లు చెప్పారు. సీనియర్ సిటిజన్స్‌కు, పెన్షనర్లకు తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నట్లు ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్, ఏపీజీవీ బ్యాంక్ మేనేజర్లు చెప్పారు. అనంతరం పది మంది సీనియర్ పెన్షనర్లకు సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డోల అప్పలనాయుడు, ఉదయ్‌కుమార్, నాగేశ్వరరావు, ఎస్‌వీ రమణ, నీలయ్య, రాంబాబు, అప్పలరాజు, నీలన్నాయుడు, నీలకంఠం, తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లు ప్రారంభం



స్విచ్ ఆన్ చేసి రైస్‌మిల్లును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, పక్కనే జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

తెర్లాం: తెర్లాంలో నూతనంగా ప్రారంభించిన శ్రీలక్ష్మీ జగన్నాథం ఆగ్రో రైస్‌మిల్లును రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పిలుపునిచ్చారు. మండల వైస్ ఎంపీపీ, జేసీఎస్ మండల కన్వీనర్ చేపేన సత్యనారాయణ, వెలగవలస సర్పంచ్ చేపేన ఫాల్గుణరావు నూతనంగా నిర్మించిన రైస్‌మిల్లును ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధునాతన యంత్రాలతో ఏర్పాటు చేసిన ఈ రైస్‌మిల్లు ఈ ప్రాంత రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు, తెర్లాం ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్‌వీ రమణరాజు(పెదబాబు), వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు కేవీ సూర్యనారాయణరాజు, పార్టీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, సీనియర్ నాయకులు నర్సుపల్లి బాబ్జీరావు, మర్రాపు జగన్నాథం, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్ సీఎం జగన్

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



తెర్లాం: లబ్ధిదారునికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

తెర్లాం: రాష్ట్రంలో ఇంతవరకు ఏ ముఖ్యమంత్రి అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను సీఎం జగన్ మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లలో అమలు చేశారని, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమాన్ని చేరువ చేశారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని కూనాయవలస, జన్నివలస గ్రామాల్లో ఆదివారం సాయంత్రం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను వివరించారు. నవరత్నాల పథకాల ద్వారా ప్రజలకు నాలుగున్నరేళ్లలో చేకూరిన లబ్ధిని తెలియజేస్తూ బుక్‌లెట్‌లను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు నవరత్నాల పథకాలతో పాటు, మరిన్ని పథకాలను అమలు చేశారని, సంక్షేమ పథకాల అమలులో అవినీతికి తావులేకుండా డీబీటీ విధానంలో నగదును నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నారని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో లంచాలు, జన్మభూమి కమిటీ సిఫార్సులు లేకుంటే పథకాలు అందేవి కావని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎటువంటి పైరవీలు లేకుండా అర్హులైన వారందరికీ నేరుగా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రజలంతా రానున్న సాధారణ ఎన్నికల్లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కూనాయవలస సర్పంచ్ బోడెల విజయబాబు, ఎంపీటీసీ, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ కర్రి సత్యనారాయణ, ఎంపీపీ ప్రతినిధి నర్సుపల్లి బాబ్జీరావు, వైస్ ఎంపీపీ ప్రతినిధి అప్పలరాజు, బాడంగి జెడ్పీటీసీ పి.రామారావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు తెంటు సత్యంనాయుడు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ డీవీ అప్పారావు, పంచాయతీ కార్యదర్శి ఎంఏ స్వామి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు కొట్టక్కిలో..

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి సచివాలయం పరిధిలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆధ్వర్యంలో సోమవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడు తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల అధికారులు పాల్గొనాలని కోరారు.

నేడు సంకిలిలో..

రేగిడి: మండలంలో సంకిలి గ్రామంలో సోమవారం ఉదయం 9 గంటలకు 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఉంటుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, విప్ మజ్జి శ్రీనివాసరావులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొననున్నారని, మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు హాజరుకావాలని కోరారు.

ధనుర్మాస పూజలు ప్రారంభం

ధనుర్మాసం ప్రారంభమవడంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భజన బృందాలు ఆదివారం వేకువ జామున నగర సంకీర్తనలు నిర్వహించారు. నెల రోజుల పాటు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయనున్నారు. బొబ్బిలి పట్టణంలోని సింగారపు వీధిలో ఉన్న వైభవ వేంకటేశ్వరాలయంలో ధనుర్మాసం సందర్భంగా స్వామివారికి విశేష కైంకర్యాలతో పూజలు చేపడుతున్నారు. రేగిడి గ్రామంలో విశ్వసాయి మందిరంలో భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ ఆధ్వర్యంలో 24 గంటల పాటు అఖండ నామ సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



బొబ్బిలి: సింగారపువీధిలోని స్వామివారి తిరువీధి పూజలు



బొబ్బిలి: అలజంగిలో నగర సంకీర్తన



రేగిడి: విశ్వసాయి మందిరంలో అఖండ నామ సంకీర్తనలో పాల్గొన్న భక్తులు



వంగర: కె.కొత్తవలసలో పూజలు చేస్తున్న అర్చకులు

పేదలకు దుస్తుల పంపిణీ



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న వెంకటరమణ

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి పొనుగుటివలస గ్రామానికి చెందిన విశ్రాంత వ్యవసాయాధికారి ఎస్.వెంకటరమణ తన ఔదార్యాన్ని చాటుకున్నారు. మండలంలోని మారెడుబాక, గడబపేట గ్రామాలకు చెందిన వృద్ధులు, పేదలకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పురుషులకు పంచెలు, దుప్పట్లు, స్త్రీలకు చీరలు, దుప్పట్లను పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఎస్.సాయిశ్వర్, కోరాడ వాసు, గాడి వెంకటరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి నూర్పులు



రామభద్రపురం: యంత్రాలతో పంట నూర్పిడి చేస్తున్న రైతులు

రామభద్రపురం: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు నీట మునిగిన వరి చేలు ఇప్పుడిప్పుడే బయటపడుతుండంతో రైతులు ధాన్యం కూడికలో నిమగ్నమయ్యారు. ఇప్పటి వరకు కోతలు కోయని వారంతా పంటకోతలు చేపడుతున్నారు. ఇప్పటికే పంటకోసి కుప్పలుగా పెట్టిన వారంతా యంత్రాల సాయంతో నూర్పిడి చేస్తున్నారు. సేకరించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. రైతులకు మద్దతు ధర చెల్లించి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుండడంతో దళారుల బెడద తప్పిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కళ్లాల వద్దే ధాన్యం కొనుగోలు



రేగిడి: జాడాపేటలో రైతులు నూర్పిడి చేసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

రేగిడి: ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు సంబంధించి పక్కా ప్రణాళికలు అమలు చేయడంతో అధికారులు కళ్లాలకు పరుగులు తీస్తున్నారు. రైతులు నూర్పిడి చేసిన వెంటనే ఆ విషయం తెలుసుకొని అగ్రికల్చర్ అసిస్టెంట్లు కళ్లాల వద్దకు వెళ్లి ధాన్యాన్ని పరిశీలించి తేమ శాతాన్ని నిర్ధారిస్తున్నారు. ట్రిప్ షీట్లు ఇచ్చి ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందుతుండడంతో రైతుల్లో ఆనందం వెల్లువిరుస్తోంది. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఈవిధంగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయలేదని నాయరాళ్లవలస, జాడాపేట, లచ్చారాయపురం తదితర గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

మారథాన్‌లో వంగర యువకుడి ప్రతిభ



గోవర్ధన్‌ను అభినందిస్తున్న సంస్థ డైరెక్టర్ రోయ్

వంగర: విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు సంస్థ నిర్వహించిన 10 కే మారథాన్‌లో వంగర మండలం మద్దువలస పంచాయతీ జగన్నాథవలసకు చెందిన అథ్లెట్ నాచు గోవర్ధన్ ప్రతిభకనబరిచాడు. ఆదివారం జరిగిన ఈ పోటీల్లో నాల్గవ స్థానం నిలిచాడు. సంస్థ నిర్వాహకులు ప్రైజ్‌మనీతో పాటు స్పోర్ట్ కిట్‌ను అందజేసినట్లు గోవర్ధన్ తెలిపారు.

రూ.6 లక్షలతో కాలువల నిర్మాణం



కాలువను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ నర్సింహులు, తదితరులు

రాజాం: మండలంలో పెనుబాక గ్రామంలో జిల్లా పరిషత్ నిధులు రూ.6 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు జెడ్పీటీసీ బండి నర్సింహులు తెలిపారు. గ్రామంలోని అన్ని వీధుల్లో పెండింగ్‌లో మురుగుకాలువల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. ఈ పనులను జెడ్పీటీసీతో పాటు ఇంజినీరింగ్ అసిస్టెంట్ కామేష్, వైఎస్సార్‌సీపీ నేత బట్న జగన్, తదితరులు పరిశీలించారు.

విద్యాప్రమాణాలు మెరుగుపడాలి



ఆమదాలవలస పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపడాలని ఎంఈఓ బి.ఎరకయ్య సూచించారు. మండలంలోని ఆమదాలవలస, రేగిడి పాఠశాలలను ఆదివారం ఆయన తనిఖీచేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. జగనన్న గోరుముద్ద పథకం సక్రమంగా అమలయ్యేలా చూడాలని ఆమదాలవలస పాఠశాల హెచ్‌ఎం అరుణకుమారికి సూచించారు. తుఫాన్ కారణంగా ఇచ్చిన సెలవులను భర్తీచేసేందుకు ఆదివారం పాఠశాలను తెరిచినట్లు ఎంఈఓ తెలిపారు.

చెత్త సేకరణ బుట్టల పంపిణీ



సంకిలిలో చెత్తబుట్టలు పంపిణీచేస్తున్న ప్రజాప్రతినిధులు

రేగిడి: మండలంలో సంకిలి గ్రామ సచివాలయం పరిధిలో ఆదివారం చెత్తసేకరణ బుట్టల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ సర్పంచ్ బుడుమూరు పట్టాభి, ఎంపీటీసీ మజ్జి శ్రీనివాసరావు, కార్యదర్శి శివకుమార్ చెత్తబుట్టలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఇంట్లోని తడి, పొడి చెత్తను వేరువేరుగా చెత్తబుట్టల్లో వేసి క్లాప్‌మిత్రలకు అందజేయాలని సూచించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కోరారు.

ఆర్థిక సాయం



కరుణాకర్‌కు ఆర్థికసాయం అందిస్తున్న లిఫ్టింగ్ హ్యాండ్ సంఘం సభ్యులు

రాజాం: శిష్టకరణాల్లో పేద కుటుంబాలకు అండగా నిలవాలని ఆంధ్రా, తెలంగాణ శిష్టకరణాల లిఫ్టింగ్ హ్యాండ్స్ సంఘం అడ్మిన్ త్యాడ ప్రసాద్ అన్నారు. పట్టణంలోని అమ్మవారికాలనీలో శిష్టకరణ సంఘంలోని పేద కుటుంబానికి చెందిన బగ్గాం కరుణాకర్ ప్రారంభించిన కిరాణాషాపును ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శిష్టకరణాల లిఫ్టింగ్ హ్యాండ్స్ యూనిట్ అడ్మిన్ సంజుక్త ప్రసాద్ ఆలోచనలతో సభ్యులు అంతా కలిసి రూ.30 వేలు ఆర్థికసాయాన్ని కరుణాకర్‌కు అందించారు. సంఘంలోని పేదలు చిరువ్యాపారాలు, స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు సభ్యులు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో విశాఖపట్నం, విజయనగరం ప్రాంతాలకు చెందిన సభ్యులు పీవీఆర్ మూర్తి, జీవీఆర్ మూర్తి, వాండ్రంకి తిరుమలరావు, బగ్గాం జోగారావు, ఏపీ శ్రీనుఅనంతరం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

వాహన తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ తిరుమలరావు

రామభద్రపురం: మండలంలోని పలు ప్రధాన కూడళ్లలో సీఐ తిరుమలరావు ఎస్‌ఐ సురేంద్రనాయుడుతో కలిసి ఆదివారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతరరాష్ట్ర కూడలి కావడం వల్ల ఒడిశా, ఛతీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి మండల కేంద్రం మీదుగా గంజాయి, ఖైనీ, గుట్కా వంటి నిషేధిత ఉత్పత్తులు అక్రమ రవాణా జరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

మెనూ కచ్చితంగా అమలు చేయాలి



జగనన్న గోరుముద్ద పథకాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకం మెనూ సక్రమంగా అమలు చేయాలని, మెనూ అమలులో ఎటువంటి లోపాలు ఉన్నా సంబంధిత నిర్వాహకులపై చర్యలు తప్పవని ఎంఈఓ జె.త్రినాథరావు అన్నారు. తెర్లాం రెగ్యులర్ పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకాన్ని ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల రికార్డులు, మరుగుదొడ్ల నిర్వహణ, మినరల్ వాటర్, జగనన్న గోరుముద్ద పథకంలో వంటలను పరిశీలించారు. జగనన్న గోరుముద్ద పథకంలో మెనూ సక్రమంగా అమలు జరిగేలా ఉపాధ్యాయులు చూడాలన్నారు. విద్యార్థుల హోంవర్క్ పుస్తకాలను దిద్దాలని, ఉపాధ్యాయులు లెస్సన్ ప్లానింగ్, డైరీలు నిర్వహించాలని సూచించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

తెర్లాం: విద్యార్థులు ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని స్థానిక శాఖా గ్రంథాలయ అధికారి సీహెచ్.కృష్ణమూర్తి అన్నారు. గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. చిన్నతనం నుంచి విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం, జ్ఞాపకశక్తి పెరుగుతాయన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరువీధి

రాజాం సిటీ: మండలంలోని కంచరాం గ్రామంలో వెలసిన పూర్ణపుష్కలాంబ సమేత హరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవాలయలంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త టంకాల పాపినాయుడు ఆధ్వర్యంలో సాయంత్రం తిరువీధి నిర్వహించారు. అలాగే సోమవారం మహాన్నసమారాధన ఉంటుందని ఆయన తెలిపారు.